సాక్షి అనంతపురం

శనివారం । 13 । జులై । 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



ఇసుక.. ఎవరికీ ఊరికే రాదు!

అనుకుంటారు కానీ.. ఇసుక ఎవరికీ ఊరికే రావడం లేదు. రవాణా, నిర్వహణ చార్జీల బాదుడుతో 'ఉచిత ఇసుక' ఉత్తిదేనని వినియోగదారులకు అర్థమైపోయింది. 8లో

గరిష్టం/కనిష్టం
37.1°/23.3°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో 29 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నీటితో కళకళలాడుతోంది. కొద్ది రోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గుల మధ్య కొనసాగుతోంది. శుక్రవారం ఉదయానికి 21,643 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 205 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ప్రస్తుతం 105.788 టీఎంసీల పూర్తి మట్టానికి గాను 29.161 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంది. ఎగువన శివమొగ్గ, శృంగేరి, తీర్థనహళ్లి, ఆగుంబే తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కుస్తుండటంతో తుంగభద్రకు వరద నీరు కొనసాగుతోంది.

నాణ్యమైన భోజనం అందించాలి



గుడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం కూడా అందించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆత్మకూరు మండలం వడ్డుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. కోడిగుడ్లు, వంట సామగ్రిని పరిశీలించారు. తాజా కూరగాయలు వాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాలలో జరిగిన నాడు–నేడు పనులను పరిశీలించారు. కోడిగుడ్లపై 1 నుంచి 7వ తేదీ వరకు బ్లూ కలర్, 8 నుంచి 15 వరకు పింక్ కలర్, 16 నుంచి 23వ తేదీ వరకు గ్రీన్ కలర్‌లో, 24 నుంచి 30 వరకు బ్రౌన్ కలర్ కల్గిన కోడింగ్ ఉండాలన్నారు. కోడిగుడ్లు తీసుకునే సమయంలో కోడింగ్ లేకుంటే ఏ విధంగా తీసుకుంటారని హెచ్‌ఎమ్ ఉమాదేవిని, ఎండీఎం నాగరాజును ప్రశ్నించారు. ఇలాంటి తప్పులు పునరావృతం కూడా చూడాలని ఆదేశించారు. చిక్కీలు స్టాకు అయిపోయేవరకు ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. భోజనం బాగుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టులకు సంబంధించిన పలు విషయాలపై ఆరా తీశారు. అనంతరం సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5 రోజుల్లో వర్షాలు

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 32.3–36.8, రాత్రి ఉష్ణోగ్రతలు 24.0–25.2 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చని తెలిపారు.

మాతా శిశు మరణాలు నియంత్రించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: మాతా శిశు మరణాల నియంత్రణకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.భ్రమరాంబదేవి పేర్కొన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గత నెలలో జరిగిన మాతా, శిశు మరణాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మాతా శిశు మరణాలకు గల కారణాలను అన్వేషించి, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గర్భిణీని 12 వారాలలోపు రిజిష్టర్ చేసుకుని ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షలు, సేవలు అందించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను ప్రారంభ దశలోనే గుర్తించి, వారికి మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రిలోనే ప్రసవం జరిగేలా చూడాలని సూచించారు. ఏ శిశువూ జన్మిస్తూ మరణించకూడదని, ఏ తల్లీ జన్మనిస్తూ మరణించకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ యుగంధర్, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి, జీజీహెచ్ అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్, గైనకాలజిస్టు డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శంకర్ నారాయణ పాల్గొన్నారు.

ఆందోళనలో అధ్యాపకులు

- జూనియర్ లెక్చరర్ల 'రెన్యూవల్'లో సందిగ్ధం
- నెలన్నరవుతున్నా రెన్యూవల్ పట్టని ప్రభుత్వం
- మే, జూన్ జీతాలు మంజూరు కాలేదంటూ గగ్గోలు
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఉమ్మడి జిల్లాలో 410 మంది ఎదురు చూపు
- గత ప్రభుత్వంలో స్వల్ప విరామంతో రెన్యూవల్...12 నెలల పాటు జీతాలు చెల్లింపు

కాంట్రాక్టు లెక్చరర్లపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఓ వైపు కాంట్రాక్టు రెన్యూవల్ కాకపోవడం.. మరోవైపు జీతాలు అందకపోవడంతో లెక్చరర్లు ఆందోళన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్వల్ప వ్యవధిలోనే రెన్యూవల్ చేశారు. ఏడాదిలో 12 నెలల కాలపరిమితికీ సర్వీస్‌లో కొనసాగేలా ఉత్తర్వులు ఇచ్చారు. అంటే ఏడాదంతా జీతాలు వచ్చాయి.



అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల 2023–24 విద్యా సంవత్సరం కాల పరిమితి ఏప్రిల్ నాటికి పూర్తయింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 'రెన్యూవల్' చేయాల్సి ఉంది. రాష్ట్రంలో కొలువుదీరిన చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. రెన్యూవల్ ఉత్తర్వులు వస్తేనే వీరికి జీతాల బిల్లులు పెట్టేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వేసవి సెలవుల్లోనూ లెక్చరర్లతో పని చేయించుకున్నారు. కళాశాలలు పునఃప్రారంభమైనప్పటి నుంచి యథావిధిగా విధులు నిర్వర్తిస్తున్నారు. రెన్యూవల్ విషయంలో మాత్రం ప్రభుత్వం నోరు మెదపడం లేదంటూ కాంట్రాక్టు లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు అందక కుటుంబాల నిర్వహణ చాలా ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 43 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటి పరిధిలో 410 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు పని చేస్తున్నారు.

మే నుంచి పని చేస్తున్నా...

కాంట్రాక్ట్ అధ్యాపకులు ఈసారి మేలో ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. తర్వాత ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల విధులు, ఆ తర్వాత ఆన్‌లైన్ మూల్యాంకనం విధులూ చేపట్టారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల అడ్మిషన్ల డ్రైవ్ కూడా నిర్వహించారు. జూన్ 1 నుంచి కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఆ రోజు నుంచి కళాశాలల్లో తరగతులు బోధిస్తున్నారు. మే, జూన్ రెండు నెలలూ పూర్తిగా పని చేశారు. కానీ ఇప్పటిదాకా జీతాలు మంజూరు చేయలేదు.

చంద్రబాబు జీఓ ఇచ్చారు... జగన్ అమలు చేశారు

2019 జనవరిలో అప్పటి సీఎం చంద్రబాబు కాంట్రాక్ట్ లెక్చరర్లకు రూ.27 వేల నుంచి రూ. 37,100కు వేతనం పెంచారు. అయితే ఏప్రిల్ నుంచి అమలయ్యేలా జీఓ ఇచ్చారు. తర్వాత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే జీతాల పెంపు జీఓను అమలు చేశారు. మూడేళ్ల కిందట పీఆర్సీ ఇచ్చిన సమయంలో ఏకంగా రూ. 57,100 వేతనం చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లపై కక్షసాధింపు

గత ప్రభుత్వంలో తమకు మేలు జరిగే నిర్ణయాలు తీసుకోవడంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటోలకు కాంట్రాక్ట్ లెక్చరర్లు క్షీరాభిషేకాలు చేశారు. కాంట్రాక్ట్ లెక్చరర్లందరూ జగన్‌కు మద్దతుగా ఉన్నారనే కారణంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు చేపడుతోందని వాపోతున్నారు. అప్పటి సీఎం మేలు చేసిన కారణంగానే క్షీరాభిషేకాలు చేశామని, ఈ ప్రభుత్వం కూడా మంచి చేసే పనులు చేపడితే కచ్చితంగా నెత్తిన పెట్టుకుంటామని కాంట్రాక్ట్ లెక్చరర్లు చెబుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



రెండు నెలలుగా జీతాల రాక చాలా ఇబ్బందులు పడుతున్నాం. మే, జూన్ నెలంతా పని చేశాం. రెన్యూవల్ కాకపోవడంతో జీతాలు బిల్లు చేయడం లేదు. కుటుంబాల నిర్వహణ ఇబ్బందిగా మారింది. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా బోధన సాగిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే రెన్యూవల్ చేసి జీతాలు మంజూరయ్యేలా చూడాలి.

– పీఎస్ అక్బర్‌బాషా, కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ నాయకుడు


'రెగ్యులర్' ఉత్తర్వులు ఇవ్వాలి



గత ప్రభుత్వ హయాంలో చట్ట ప్రకారం కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసేలా చర్యలు తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మందికి గాను 1,700 మంది జూనియర్ అధ్యాపకులు 'రెగ్యులర్'కు అర్హత సాధించారు. వారందరికీ వెంటనే క్రమబద్ధీకరణ ఉత్తర్వులు ఇవ్వాలి.

– కె.నారాయణస్వామి, కాంట్రాక్ట్ అధ్యాపకుడు, జీజేసీ, కొత్తచెరువు

అంబేడ్కర్ ఫౌండేషన్‌తో ఎస్సీ, ఎస్టీలకు వైద్య సాయం



అనంతపురం రూరల్: సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వ శాఖ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు వైద్య సహాయం అందజేయనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కిడ్నీ, గుండె, కాలేయం, క్యాన్సర్, మెదడు, అవయవ మార్పిడి, వెన్నెముక శస్త్రచికిత్సతో పాటు ఏదైనా ప్రాణంతకమైన వ్యాధులతో బాధపడుతున్న ఎస్సీ, ఎస్టీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వైద్య సాయం పథకం కింద వైద్యానికి ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. కుటుంబ వార్షికాదాయం రూ. 3 లక్షల లోపు ఉన్నవారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. గుండె శస్త్ర చికిత్సకు రూ.1.50 లక్షలు, కిడ్నీ సర్జరీ, డయాలసిస్‌కు రూ.3.50 లక్షలు, కాన్సర్స్ సర్జరీ, కీమోథెరపీ, రేడియోథెరపీకి రూ.1.75 లక్షలు, బ్రెయిన్ సర్జరీకు రూ.1.50 లక్షలు, అవయవ మార్పిడికి రూ.3.50 లక్షలు, వెన్నముక శస్త్ర చికిత్సకు, ప్రాణంతకమైన వ్యాధులకు రూ. లక్ష చొప్పున సాయం అందించనున్నట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాల కోసం ambedkarfoundation.nic.in ను సంప్రదించాలన్నారు.

రిమాండ్ నిందితులకు బెయిల్

కడప అర్బన్ : ఘర్షణ కేసులకు సంబంధించి రిమాండ్‌లో ఉన్న నిందితులకు బెయిల్ మంజూరైంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో తాడిపత్రిలో ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘటనల్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీలకు చెందిన 60 మందిని అప్పట్లో అరెస్ట్ చేశారు. మెజిస్ట్రేట్ల ఆదేశాల మేరకు కడప కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న వీరికి ఎట్టకేలకు శుక్రవారం బెయిల్ మంజూరైంది. దీంతో వారంతా కారాగారం నుంచి బయటకు వచ్చారు.

నైరాశ్యం మిగిల్చిన నైరుతి

- ముందస్తుగా మురిపించిన తొలకర్లు
- కీలక సమయంలో ముఖం చాటేసిన వరుణుడు
- 75 వేల హెక్టార్ల దగ్గర ఆగిన ఖరీఫ్ సాగు



నాగిరెడ్డిపల్లి సమీపంలో ఎండిపోతున్న వేరుశనగ



బ్రహ్మసముద్రం సమీపంలో బీడు పడిన పొలం

అనంతపురం అగ్రికల్చర్: ముందస్తుగా తొలకరి వర్షాలతో పలకరించి ఆశలు రేకెత్తించిన 'నైరుతి'.. చివరకు తీవ్ర నిరాశపరచింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా జూన్ 14 నాటికే ఏకంగా 143 మి.మీ వర్షం కురిసింది. ఆ తర్వాత నుంచి వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో అన్నదాత పరిస్థితి గందరగోళంగా మారింది. అదనులో పదును కాక 'ఖరీఫ్' పడకేసింది. సమయం మీరిపోతుందనే ఆత్రుతతో అరకొర తేమలోనే రైతులు సాగు చేపట్టారు. అయినా 75 వేల హెక్టార్లకు మించి విత్తు పడలేదు. ఈ ఏడాది 3.46 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు వేస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతానికి 20 శాతం విస్తీర్ణంలో పంటలు వేయగా... ఇంకా 80 శాతం విస్తీర్ణం మిగిలిపోయింది. అసలైన విత్తు సమయం కూడా ఈ నెల 15తో ముగియనుంది. ఇక మిగిలింది కొసరు సమయం మాత్రమే. అంటే ఈ నెలాఖరు వరకు విత్తు వేసుకునేందుకు అనుకూల సమయం ఉంది.

జాడ లేని రుతుపవనాలు

జూన్ 14 తర్వాత ఒక్కసారిగా నైరుతి రుతుపవనాల జాడ కనిపించకుండాపోయింది. ఆషాఢం గాలులకు మేఘాలు చెదిరియాయి. జూన్ నెల ముగిసేనాటికి సాధారణం కన్నా 142 శాతం అధికంగా 147.7 మి.మీ నమోదైంది. జూన్ 15 తర్వాత 5 మి.మీ కూడా వర్షపాతం నమోదు కాకపోవడం గమనార్హం. కనీసం జూలైలో అయినా పంట వేద్దామనుకుంటే విత్తుకు సరిపడా పదును వాన పడలేదు. నెల రోజులు పూర్తయినా రెయినీడేస్ (వర్షపు రోజులు) 11గానే మిగిలిపోయాయి. జూలై నెల సాధారణ వర్షపాతం 63.9 మి.మీ కాగా ఇప్పటి వరకూ అక్కడక్కడా అపుడప్పుడు గాలితెరలతో 8 మి.మీ నమోదు కావడం వర్షాభావ తీవ్రతకు అద్దం పడుతోంది. దాదాపు అన్ని మండలాల్లో సుదీర్ఘ డ్రైస్పెల్స్ (వర్షపాత విరామాలు) నమోదవుతున్నాయి. కాగా పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్రలో మంచి వర్షాలు పడుతున్నాయి. ఇక్కడేమో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం గమనార్హం.

ఇక ప్రత్యామ్నాయమే దిక్కు

ఖరీఫ్‌లో ప్రధాన పంటలైన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జూలై 15 వరకు మంచి సమయమని అధికారులు, శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతానికి మంచి అదను దాదాపు ముగుస్తోంది. రైతులకు ఇష్టమైన ఆరుద్ర కార్తె ఈ నెల 6న ముగిసింది. ప్రస్తుతం పునర్వసు కార్తె ఈ నెల 20 వరకు ఉంటుంది. అంతలోపు పంటలు వేసుకుంటే ఇబ్బంది ఉండదని రైతులు భావిస్తారు. ఇప్పుడు వర్షం వచ్చినా మిగిలిన 80 శాతం విస్తీర్ణం సాగులోకి రావడం కష్టంగానే కనిపిస్తోంది. దీంతో ఇక ప్రత్యామ్నాయ పంటలే శరణ్యమనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఆగస్టులో ఎట్టి పరిస్థితుల్లోనూ వేరుశనగ, కంది, ఆముదం, పత్తి లాంటి పంటల సాగు వద్దని అధికారులు చెబుతున్నారు. ఉలవ, పెసర, అలసంద, స్వల్పకాలిక కంది, సజ్జ, కొర్ర లాంటి ప్రత్యామ్నాయంగా సాగు చేయాలని సూచిస్తున్నారు. 2.50 లక్షల హెక్టార్లకు వ్యవసాయశాఖ ఇంకా ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేసినట్లు లేదు. చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కూడా ఖరీఫ్ సాగు, రైతుల కష్టనష్టాల గురించి ఆలోచిస్తున్న దాఖలాలు కనిపించ లేదు. రైతు భరోసా కింద పెట్టుబడిసాయం, పంటల బీమా కింద పరిహారం, కొత్తగా పంటల బీమా పథకాల అమలును పట్టించుకోని పరిస్థితి ఉన్నందున రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

మట్టి పట్టిన 'పరీక్ష'లు

ఉమ్మడి జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్న అనంతపురంలోని భూసార పరీక్షా కేంద్రం సరైన నిర్వహణ లేక అధ్వానంగా మారింది. భవనం పైకప్పు పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంది. ఫర్నీచర్, పరీక్షా సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. తుప్పు పట్టిన చెక్క బల్లలు, స్టాండ్లు, విరిగిన కుర్చీలు దర్శనమిస్తున్నాయి. కేంద్రం అధికారి చాంబర్ కొంత వరకు బాగానే ఉన్నా... మిగిలిన గదుల పరిస్థితి దారుణంగా ఉంది. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన సంచార ప్రయోగశాల బస్సు కొన్నేళ్లుగా మూలనపడి ఉంది. అలాగే రూ.వేల విలువ చేసే కొన్ని చాంబర్లు, పరీక్షా సామగ్రి, మోటార్లు కొత్తవి వాడకుండా అలాగే ఉంచేశారు. వివిధ పరీక్షలు చేయడానికి ప్రయోగశాల సరిపోకపోవడంతో వరండాలోనే చాలా వరకు విశ్లేషణలు కానిస్తున్నారు. రెండు జిల్లాలకు కలిపి ఒకటే ఉన్న ఈ ప్రయోగశాలలో అరకొర వసతుల మధ్య లక్ష్యం మేరకు మట్టి పరీక్షలు చేసి విశ్లేషించడం అంత సులభంగా లేదనే విషయం అర్థమవుతోంది.

– అనంతపురం అగ్రికల్చర్:



తుప్పు పట్టిన మట్టి నమూనాల చెక్క స్టాండ్



ప్రయోగశాలలో చిందరవందరగా ఫర్నీచర్, సామగ్రి



శిథిలావస్థకు చేరుకున్న భూసార పరీక్షా కేంద్రం

రేపటి నుంచి సత్యసాయి జాతీయ క్రికెట్ లీగ్



సత్యసాయి జాతీయ క్రికెట్ లీగ్ ట్రోఫీ

ప్రశాంతి నిలయం: సత్యసాయి సంస్థల్లో పనిచేసే యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఏడాది పాటు సాగే పోటీలకు సంబంధించి ప్రారంభ కార్యక్రమం ఆదివారం ఉదయం పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో జరగనుంది. ప్రారంభ మ్యాచ్ భారత్ లెవన్స్, గ్లోబల్ లెవెన్స్ మధ్య జరగనుంది. భారత మాజీ క్రికెటర్ మురళీ కార్తీక్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి మ్యాచ్ ప్రారంభించనున్నారు.

ఏడు దశలు..ఏడాది పాటు..

సత్యసాయి జాతీయ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు ఏడు దశల్లో ఏడాది పాటు జరగనున్నాయి. తొలుత సత్యసాయి సమితి స్థాయిలో, ఆ తర్వాత ఇంటర్ సమితి, జిల్లా, ఇంటర్ డిస్ట్రిక్ట్, ఇంటర్ స్టేట్, జోనల్, అంతిమంగా జాతీయ స్థాయిలో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఫైనల్ మ్యాచ్ 2025 జూలై 14న పుట్టపర్తిలోని సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో జరగనుంది. సమితి స్థాయిలో జరిగే మ్యాచ్‌లను ఆయా ప్రాంతాల్లోని పాఠశాల, కళాశాలల మైదానాల్లో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 18 – 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, సత్యసాయి సేవా సమితుల్లో క్రియాశీలకంగా వ్యవహరించే వారే అర్హులని నిర్వాహకులు తెలిపారు.

తారల సందడి

అనంతపురంలో సినీ తారలు నిధి అగర్వాల్, అనసూయ సందడి చేశారు. శుక్రవారం నగరంలో ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వారు విచ్చేశారు. తారలను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా తమ స్టెప్పులు, డైలాగులతో తారలు అలరించారు. ఈలలు, కేకలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. ఈ దృశ్యాలను అభిమానులు సెల్‌ఫోన్లలో బంధించి భద్రపరచుకోవడం కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అభిమానులను పలకరిస్తున్న సినీ తారలు అనసూయ, నిధి అగర్వాల్



సెల్‌ఫోన్లలో సినీతారల ఫొటో, వీడియోలు తీసుకుంటున్న అభిమానులు

క్లుప్తంగా

సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం



జ్యోతి వెలిగించి షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన తారలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని సుభాష్ రోడ్డులో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సినీ తారలు నిధి అగర్వాల్, అనసూయ సందడి చేశారు. మాల్‌లోని వస్త్రాలను ప్రదర్శించారు.

గంబూషియా చేపల విడుదల

రాప్తాడు: మలేరియా, డెంగీ, ఫైలేరియా వ్యాధులు ప్రబలేందుకు కారణమైన దోమలు వృద్ధి చెందకుండా నీటి కుంటల్లో గంబూజియా చేపలను వదులుతున్నట్లు జిల్లా మలేరియా అధికారి ఓబులు తెలిపారు. శుక్రవారం రాప్తాడులోని పీహెచ్‌సీలో ల్యాబ్, మందుల గదిని ఆయన పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. మలేరియా, డెంగీ, ఫైలేరియా కేసులపై వైద్యాధికారి శివకృష్ణతో ఆరా తీశారు. అనంతరం రాప్తాడు, మరూరు, ఎం.బండమీదపల్లిలోని నీటి కుంటల్లో గంబూజియా చేపలను విడుదల చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, వైద్యాధికారులు శ్రావణి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

కళ్యాణదుర్గం రూరల్: శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న కళ్యాణదుర్గం మండలం పాపంపల్లికి చెందిన మంజునాథ్(32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కొన్నేళ్ల క్రితం తండ్రి మృతి చెందడంతో తల్లి గౌరమ్మతో కలసి పాపంపల్లిలోనే నివాసముంటున్నాడు. గురువారం రాత్రి భోజనం చేసి ఇంటి బయట పడుకున్న మంజునాథ్ శుక్రవారం ఉదయం ఎంతసేపటికీ నిద్ర లేవలేదు. తల్లి దగ్గరకు వెళ్లి పరిశీలించింది. అప్పటికే మంజునాథ్ మృతి చెందినట్లు నిర్ధారించుకుని బోరున విలపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మంజునాథ్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఇసుక.. ఎవరికీ ఊరికే రాదు!

- స్టాక్ పాయింట్‌లో టన్ను ఇసుక రూ.195
- రవాణాకు కిలోమీటరుకు రూ.145కి పైగా అదనపు ఖర్చు
- నూతన విధానం పేరుతో వినియోగదారులకు కుచ్చుటోపీ



జుంజురాంపల్లిలోని ఇసుక స్టాక్ పాయింట్

అనంతపురం టౌన్: జిల్లాలో ఎవరికీ ఇసుక ఊరికే రావడం లేదు. ఇసుక కావాలనుకుంటే డబ్బు చెల్లించక తప్పడం లేదు. జిల్లా మొత్తానికి ఒకే ఒక్క స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయడంతో ఇసుక అవసరాలున్న ప్రతి ఒక్కరికీ రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. గత ప్రభుత్వంలో కంటే రెట్టింపు ఖర్చు భరించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం మండలం జుంజురాంపల్లిలోని స్టాక్ పాయింట్ నుంచి ఇసుకను నిర్దేశిత ప్రాంతానికి తరలించాలంటే కిలోమీటర్‌కు రూ.145కి పైగా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది కేవలం రవాణా చార్జీలు మాత్రమే. దీనికి తోడు స్టాక్ పాయింట్‌లో లిఫ్టింగ్ చార్జీలు టన్నుకు రూ.195 చెల్లించాలి. ఈ లెక్కన ఉచిత ఇసుక అనేది ప్రభుత్వ లెక్కల్లోనే తప్ప క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

మోయలేని భారం

నూతన విధానం పేరుతో ఇసుక వినియోగదారులపై మోయలేని భారాన్ని చంద్రబాబు ప్రభుత్వం మోపింది. ఉదాహరణకు రాయదుర్గం స్టాక్ పాయింట్ నుంచి టిప్పర్ ఇసుకను దాదాపు 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడిపత్రి పట్టణానికి తరలించాలంటే టిప్పర్‌కు కిలోమీటరుకు రూ.145 చొప్పున రూ.20,300 చెల్లించాల్సి వస్తోంది. అలాగే స్టాక్‌పాయింట్‌లో టన్ను ఇసుకకు రూ.195 చొప్పున 18 టన్నుల టిప్పర్ లోడ్‌కు రూ.3,510 ఖర్చవుతోంది. ఈ లెక్కన రాయదుర్గం నుంచి తాడిపత్రికి టిప్పర్ ఇసుక తరలించేందుకు మొత్తం రూ.23,810ను వినియోగదారుడు భరించక తప్పడం లేదు. ఈ లెక్కన తాడిపత్రి వాసులకు టన్ను ఇసుకకు రూ.1,323 చెల్లించాల్సి వస్తోంది. ఇది సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భరించలేని భారమవుతోంది.

గతంలో నియోజకవర్గానికో స్టాక్ పాయింట్

గత ప్రభుత్వంలో జిల్లాలో ఇసుక అవసరాలు తీర్చేందుకు నియోజకవర్గానికో స్టాక్ పాయింట్ చొప్పున ఉండేది. ఈ లెక్కన జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 8 స్టాక్ పాయింట్లు అందుబాటులో ఉండేవి. అనంతపురం, బుక్కరాయసముద్రం, కొర్రపాడు, తాడిపత్రి, రాప్తాడు, గుంతకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ తదితర ప్రాంతాలతో పాటు రాయదుర్గంలో సైతం స్టాక్ పాయింట్‌ను అప్పట్లో ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నూతన ఇసుక విధానం పేరుతో జిల్లాలోని రాయదుర్గం మండలం జుంజురాంపల్లి గ్రామ సమీపంలో ఒకే ఒక్క స్టాక్ పాయింట్ నుంచే ఇసుక తరలించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడి నుంచి ఇసుకను జిల్లా నలుమూలలకు తరలించాలంటే వినియోగదారులకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి.

ఇసుక రీచ్‌తో పాటు స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలి

ఇసుక లభ్యమయ్యే రీచ్ దగ్గరలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి నియోజకవర్గంలో ఓ స్టాక్ పాయింట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఇసుక వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇసుక లభ్యమయ్యే చోటునే స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయడం ద్వారా అక్కడికి సమీపంలోని వారికి ఖర్చులు తగ్గిపోతాయి. ఇసుక కావాల్సిన వినియోగదారుడు నియోజకవర్గ కేంద్రానికి కాకుండా రీచ్ వద్ద నుంచే తరలించుకుంటే రవాణా ఖర్చులు పూర్తిగా తగ్గుతాయి. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

గుంతకల్లుకు రూ.12,500 రవాణా ఖర్చు



రాయదుర్గం మండలం జుంజురాంపల్లి ఇసుక స్టాక్ పాయింట్ నుంచి గుంతకల్లుకు టిప్పర్ ఇసుక రవాణాకు రూ.12,500 బాడుగ నిర్ణయించారు. వినియోగదారుడే అక్కడ ఇసుక లిఫ్టింగ్ చార్జీలు చెల్లిస్తాడు. కేవలం ఇసుక రవాణా వరకూ మా బాధ్యత.

– రాము, టిప్పర్ డ్రైవర్, గుంతకల్లు

ఇసుక విధానం రావాల్సి ఉంది

ఇసుక పాలసీని ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. ప్రస్తుతం విధానంతో స్టాక్ ఉన్న పాయింట్ నుంచే ఇసుకను విక్రయిస్తున్నాం. ప్రభుత్వం ఇసుక విధానం ప్రకటిస్తే ఆ మేరకు ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం జిల్లాలో ఇసుక ఉచితంగానే ఇస్తున్నాం. రీచ్‌ల నుంచి స్టాక్ పాయింట్‌కు తరలించేందుకు అయ్యే లిఫ్టింగ్ ఖర్చులు మాత్రమే వసూలు చేస్తున్నాం. – నాగయ్య, గనులశాఖ డీడీ

'చార్ దిన్‌కా సుల్తాన్' పాయే..

- ఎఫ్ఏసీ బాధ్యత తనకొద్దంటూ ఎంపీడీఓకు పంచాయతీ కార్యదర్శి వినతి

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు రూరల్: రంగంలోకి వచ్చిన చార్ దిన్‌కా సుల్తాన్ వెళ్లిపోయారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో నాలుగు రోజుల పాటు సెలవు పెట్టిన అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ స్థానంలో ఆలమూరు పంచాయతీ కార్యదర్శి సర్దార్‌వలికి నిబంధనలకు విరుద్ధంగా నాలుగు రోజులకు గాను ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నిర్వాకంపై 'రంగంలో చార్ దిన్‌కా సుల్తాన్' శీర్షికతో గురువారం 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన సర్దార్‌వలి ఇక్కడి పరిస్థితులు తెలుసుకుని ఈ బాధ్యతలు తనకొద్దంటూ గురువారం సాయంత్రమే ఎంపీడీఓకు రాతపూర్వకంగా ఇచ్చారు.

లెక్కచేయని రిజిస్ట్రేషన్ శాఖ

కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలోని 14–2 సర్వే నంబరులో వెలసిన అనధికారిక లేఔట్‌లో ప్రభుత్వానికి కోట్లాది రూపాయలను నిర్వాహకులు ఎగ్గొట్టినా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఏమాత్రం లెక్కలోకి తీసుకోవడం లేదు. అనుమతులు లేవని ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్ట్రేషన్లు చేయొద్దని స్వయంగా పంచాయతీ అధికారులు రాతపూర్వకంగా లేఖలు ఇచ్చినా బేఖాతరు చేశారు. తమకు అందుతున్న ముడుపులతో గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలిసింది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ లేఔట్‌ను సక్రమం చేస్తున్నారు. కాగా, ఈ వ్యవహారంపై కొందరు కోర్టుకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఎంపీపీపై టీడీపీ నాయకుల దాడి

గుమ్మఘట్ట: ఎంపీపీ భవానీపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. మండలంలోని కలుగోడులోని తన నివాసం వద్ద ఉన్న భవానీపై పాతకక్షల నేపథ్యంలో శుక్రవారం అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు లక్ష్మి, ఆమె కుమారుడు దాడి చేసి, గాయపరిచారు. ఘటనపై పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది.

● అధినేతతో భేటీ



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రజాశ్రేయస్సుకు విఘాతంగా నూతన క్రిమినల్ చట్టాలు





మాట్లాడుతున్న ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్ర ప్రసాద్, హాజరైన న్యాయవాదులు

అనంతపురం: కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన నూతన క్రిమినల్ చట్టాలు ప్రజా శ్రేయస్సుకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్ర ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. నూతన చట్టాలపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుంకర రాజేంద్ర ప్రసాద్‌తో పాటు ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ సభ్యుడు ఆలూరి రామిరెడ్డి, అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్ మాట్లాడారు. పౌర సమాజం శ్రేయస్సు దృష్ట్యా నూతన క్రిమినల్ చట్టాలపై న్యాయవాదులు లోతైన పరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. బెయిల్ మంజూరులో మార్గదర్శకాలు, పోలీసు అధికారులను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లుగా పరిగణించడం చూస్తుంటే జ్యుడిషియరీ అధికారాలు నియంత్రించేలా నూతన చట్టాలు ఉన్నాయన్నారు. దీంతో న్యాయవాదులు పెను సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. చట్టాలు రూపొందించిన ప్రక్రియ హేతుబద్ధంగా లేదన్నారు. శాస్త్రీయమైన చర్చ లేకుండా రూపొందించిన చట్టాల వల్ల పౌర సమాజానికి ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. ప్రజాస్వామ్య హక్కులను హరించడానికి పాలకులకు ఈ చట్టాలు ఉపయోగపడతాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. న్యాయవాదులు ఈ చట్టాన్ని కూలంకషంగా చదివి, పరిశీలించి, అవగాహన చేసుకున్న తర్వాత ప్రమాదకరమైన అంశాలను తొలగించడానికి లేదా సవరించడానికి ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయంగా ఇప్పటికే ఇప్పటికే దేశ వ్యాప్తంగా పలు చోట్ల న్యాయవాదులు, ప్రజలు, రాజకీయ పార్టీలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, జిల్లా అధ్యక్షుడు వీరు యాదవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యచంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ ప్రకాష్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు వీడాలి

- ఎస్‌సీఆర్ఎంయూ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

గుంతకల్లు: ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు వీడాలని కేంద్ర ప్రభుత్వాన్ని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మహా ప్రదర్శన కార్యక్రమాన్ని డీఆర్ఎం కార్యాలయం సమీపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ కార్మిక వ్యతిరేక వాదీ అంటూ విమర్శించారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలంటూ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. 8వ పే కమిషన్‌ను అమలు చేయకుండా తొక్కి పెడుతున్నారన్నారు. ట్రాక్‌మెన్‌లకు సైకిల్ అలవెన్స్ ఇవ్వడం లేదన్నారు. టూల్ బాక్స్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. విధించిన లక్ష్యాన్ని చేరుకోలేని టీటీఈలకు పనిష్మెంట్ ఇవ్వడం సబబు కాదన్నారు. కారుణ్య నియమాకాల్లో వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ల ఆగడాలు పెచ్చుమీరాయన్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ సహాయ కార్యదర్శులు మధుసూదన్‌రావు, నారాయణ, శేఖర్‌బాబు, అశ్విని, వివిధ బ్రాంచ్ సెక్రటరీలు ఎస్ఎం బాషా, డి.రమేష్, రాజశేఖర్, వై.సుధాకర్, రవీంద్రనాయక్, మాజీ ఏడీఎస్ మస్తాన్‌వలి, నాయకులు జాఫర్ పాల్గొన్నారు.

సత్యసాయి ఆశయ సాధనే లక్ష్యం కావాలి



సదస్సుకు హాజరైన ప్రతినిధులు



ప్రసంగిస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు

- గ్లోబల్ యూత్ సదస్సులో ఆర్‌జే రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఆశయ సాధనే లక్ష్యంగా సత్యసాయి యువత పనిచేయాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు పిలుపునిచ్చారు. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరం వేదికగా సత్యసాయి గ్లోబల్ యూత్ సదస్సు శుక్రవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, వైస్ చైర్మన్ నిమీష్ పాండే, ట్రస్ట్ సభ్యుడు నాగానంద తదితరులు జ్యోతి ప్రజ్వల చేసి సదస్సును ప్రారంభించారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ విభాగంలోని 24 దేశాల నుంచి విచ్చేసిన యువతీ, యువకులు వేద పఠనం చేస్తూ సత్యసాయి మహా సమాధి చెంతకు చేరుకున్నారు. అనంతరం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ భక్తి గీతాలు ఆలపించారు. 'రీ కనెక్ట్, రీచార్జ్, రీజాయిస్' అన్న నినాదంతో ఏర్పాటు చేసిన సదస్సులో ఆర్‌జే రత్నాకర్ రాజు మాట్లాడారు. సమ సమాజ స్థాపనకు సత్యసాయి చేసిన కృషిని కొనియాడారు. అనంతరం నిమిష్ పాండే, నాగానంద, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ప్రతినిధులు సత్యసాయి ఆశయాలు, లక్ష్యాలు, యువత పాత్రను వివరిస్తూ ప్రసంగించారు. సత్యసాయి గ్లోబల్ యూత్ సదస్సుకు విచ్చేసిన వివిధ దేశాల ప్రతినిధులు సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గురుకులాల్లో మిగులు సీట్లకు 16న కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సర ప్రవేశాలకు సంబంధించి మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 16న నార్పల మండలం బి.పప్పూరు గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకుల పాఠశాలలు, కళాశాలల జిల్లా కోఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఏజీ సెట్–2024లో చూపిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. బాలుర కళాశాలల్లో 41, బాలికల కళాశాలల్లో 140 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

● గూగూడుకు సందర్శకుల తాకిడి



చావిడి వద్ద అగ్నిగుండం

మొహర్రం నేపథ్యంలో గూగూడుకు సందర్శకుల తాకిడి పెరిగింది. శుక్రవారం ఉదయం నుంచి బస్సులు, ప్రత్యేక వాహనాల ద్వారా సందర్శకులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. కుళ్లాయిస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు దీరుతున్నారు. చావిడి ఎదుట దేదీప్యమానంగా వెలుగుతున్న అగ్ని గుండం వద్ద భక్తిశ్రద్ధలతో మొకరిల్లి, మొక్కులు చెల్లించుకుంటున్నారు. దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



కొలువుదీరిన కుళ్లాయిస్వామి పీర్లు



తప్పెట కళాకారుల సందడి



అగ్నిగుండం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



గూగూడులో వెలసిన దుకాణాలు

విధుల్లో లేకపోతే ఎలా?

- ఆర్థో అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ ఆగ్రహం
- సీసీ కెమెరాల నిర్వహణపై అసంతృప్తి


చిన్నపిల్లల వార్డులో వైద్యులతో మాట్లాడుతున్న కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం కార్పొరేషన్: రోగులకు అందుబాటులో ఉండకుండా ఎక్కడకు వెళ్లారు? విధుల్లో లేకపోతే ఎలా? పని వేళల్లో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ వైద్యులపై ఆదేశించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ సర్వజనాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని మేల్‌మెడిసిన్, ఫీమేల్ మెడిసిన్, ఐసీయూ, క్యాజువాలిటీ, గైనిక్, చిన్నపిల్లల వార్డులను నిశితంగా పరిశీలించారు. ఆర్థో వార్డులో డ్యూటీ వైద్యురాలు స్వాంతన లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడికి వెళ్లారని ఆర్ఎంఓ డాక్టర్ పద్మజను ఆరా తీశారు. క్యాజువాలిటీకి వెళ్లారని.. అక్కడి సిబ్బంది సమాధానం ఇచ్చారు. అక్కడ ఆమె విధుల్లో లేరు కదా అని ప్రశ్నించారు. తక్షణం ఇక్కడికి రావాలని ఆదేశించారు. కాసేపటికి డాక్టర్ స్వాంతన ప్రత్యక్షమయ్యారు. రోగులకు అందుబాటులో ఉండాలని డాక్టర్ స్వాంతనను కమిషనర్ ఆదేశించారు. అదేవిధంగా గైనిక్ విభాగంలో డ్యూటీ వైద్యులు ఎవరెవరు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత వైద్యులు ఆపరేషన్ థియేటర్‌లో ఉన్నారని సిబ్బంది తెలిపారు. క్యాజువాలిటీలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, తదితర సిబ్బందికి చెందిన రికార్డులను కమిషనర్ పరిశీలించారు. క్యాజువాలిటీలో మరమ్మతులు చేయించాలన్నారు. ఆర్థో వార్డులో బాత్‌రూంను కమిషనర్ పరిశీలించారు. నీరు సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావును ఆదేశించారు. శానిటేషన్, సెక్యూరిటీ నిర్వహణ ఎలా ఉందని ఆరా తీశారు.

సీసీ కెమెరాలు పని చేయాలి

ఆర్ఎంఓ చాంబర్‌లో ఉన్న సీసీ కెమెరాలను కమిషనర్ పరిశీలించారు. సీసీ కెమెరాల నిర్వహణ సరిగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు నిర్వహించే వారితో మాట్లాడి రౌండ్ ద క్లాక్ కెమెరాలు పని చేసేలా చూడాలని ఆదేశించారు. రోగులు, సిబ్బంది భద్రతకు సంబంధించి కెమెరాల నిర్వహణ బాగా ఉండాలన్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణితో కమిషనర్ సమావేశమయ్యారు. ఆస్పత్రికి రోజూ 2 వేల మంది వరకు ఔట్ పేషంట్లు, 1,100 మంది ఇన్‌పేషంట్లు సేవలు పొందుతున్నారని సూపరింటెండెంట్ వివరించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న డీసీహెచ్ఎస్ కార్యాలయాన్ని మరో ప్రాంతానికి తరలించాలని విన్నవించారు. ఆ ప్రాంతంలో చిన్నారులకు ఉపయోగపడేలా వార్డు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా సెంట్రల్ ల్యాబ్‌కు నిధులు కేటాయించేలా చూడాలన్నారు.

క్లుప్తంగా

సీఈ నాగరాజుకు సత్కారం


సీఈ నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: జలవనరుల శాఖ నూతన సీఈగా బాధ్యతలు చేపట్టిన నాగరాజును శుక్రవారం డిప్లొమో ఇంజినీర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర మూర్తి శాలువా, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోషియేషన్ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, వీరేంద్ర, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

రేపు రెడ్డి వివాహ పరిచయ వేదిక

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14న రెడ్డి వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేస్తునట్లు సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు పాపంపేట (బీఎస్ఎన్ఎల్ టవర్ వెనుక) కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి 12:30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రెడ్డి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులు వచ్చేటప్పుడు తమ పిల్లల బయోడేటా కచ్చితంగా తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు దుబ్బ కిషోర్ రెడ్డి 94944 35168, తోపుదుర్తి రామకృష్ణారెడ్డి 94907 67224, మంత్రి విశ్వనాథ రెడ్డి 99892 38044 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎస్వీ డిగ్రీ కళాశాలలో 'పూల్ క్యాంపస్ డ్రైవ్'


ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల, కంపెనీ ప్రతినిధులు


అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం పీపుల్ టెక్ గ్రూప్ కంపెనీ ఆధ్వర్యంలో 'పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌కు 75 మంది అభ్యర్థులు హాజరు కాగా 24 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి తెలిపారు. అభ్యర్థులకు మొదటి రౌండ్ గ్రూప్ డిస్కషన్ తర్వాత రెండోరౌండ్‌లో వ్యక్తిగత ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో పీపుల్ టెక్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులు భాస్కర్ ఓ.అక్షయ ఓ.దివ్య రెడ్డి, సురేష్, సూరజ్, ప్రిన్సిపల్ ఎస్‌వీ ప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి సాయిరామ్, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం ఎంపికై న వారికి నియామక పత్రాలు అందజేశారు. కాగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ సి.సోమశేఖర రెడ్డి అభినందించారు

అనుమతి లేని ఎరువులు విక్రయించొద్దు


మాట్లాడుతున్న ఏడీఏ రవి

ఆత్మకూరు: రైతులకు విక్రయించే ఎరువులు, మందులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలి. అనుమతి లేని వాటిని ఎట్టి పరిస్థితుల్లో విక్రయించొద్దని ఏడీఏ రవి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఫర్టిలైజర్స్ షాపుల నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. అనుమతి లేని ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీఆర్‌సీ కార్డుల రిజిస్ట్రేషన్, మట్టి నమూనాల సేకరణ, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా పంపిణీ చేయబడిన ట్రాక్టర్, పనిముట్లను తనిఖీ చేశారు. అంతకుముందు ఆముదం, కంది, వేరుశనగ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత, వీహెచ్ఏ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భోజనం నాణ్యతగా ఉండాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ దశరథరామయ్య

ఆత్మకూరు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణత్యగా ఉండాలని ఎంపీడీఓ దశరథరామయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుతో కలసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటలు వండేందుకు తాజా కూరగాయలు వాడాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారులను సంప్రదించాలని సూచించారు.

కమనీయం.. కల్యాణం


ఆత్మకూరు: అలంకరణలో ఉత్సవ విగ్రహాలు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్కంధ షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. తొలుత స్వామి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీవల్లి, దేవసేన ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో అర్చకులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేసి, అన్నదానం చేశారు.

సుబ్రమణ్యేశ్వర పాహిమాం

అనంతపురం కల్చరల్: సుబ్రహ్మణ్యేశ్వర పాహిమాం నామస్మరణతో నగర శివారులోని శివ బాలయోగి ఆశ్రమం మార్మోగింది. శుక్రవారం ఆషాడంలో వచ్చిన స్కంద షష్టి సందర్భంగా పలుచోట్ల విశేష పూజలు, కల్యాణోత్సవాలు కమనీయంగా జరిగాయి. శ్రీవల్లి సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. జూటూరు అరవింద్, రత్నగిరి దేవరాజ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. చెరువు కట్ట, మారుతీనగర్ తదితర చోట్ల షష్టి వేడుకలు భక్తి శ్రద్ధలతో సాగాయి. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని అన్నపూర్ణ మంజునాథేశ్వర ఆలయంలో సుబ్రమణ్యేశ్వరుడు పూజలందుకున్నాడు. ప్రధాన అర్చకుడు బసవరాజస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, అలంకార సేవల్లో భక్తులకు దర్శనమిచ్చిన స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


పూజలందుకున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు

పోరాట యోధుడు 'వెంగమనాయుడు'


అన్నదానంలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: తన జీవితాంతం కష్టజీవుల హక్కుల కోసం పోరాడిన యోధుడు కామ్రేడ్ పెనకలపాటి వెంగమనాయుడు అని పలువురు ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు కొనియాడారు. వెంగమ నాయుడు 27వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సర్వజన ఆస్పత్రి ఎదుట అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మాట్లాడుతూ.. వెంగమనాయుడు ఏడు దశాబ్దాల కిందటే జిల్లాలో వ్యవసాయ కూలీలు, రైతుల హక్కుల సాధనకు కృషి చేశారన్నారు. తాడిపత్రి ప్రాంతంలో అప్పటి భూస్వామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా కూలీలను సమీకరించి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు వీకే రంగారెడ్డి, ఆకుతోటపల్లి నారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, బి.రామ్మోహన్, ఎస్.తిరుపతయ్య, సీనియర్ జర్నలిస్టులు తలారి రామాంజనేయులు, ఐ న్యూస్ రేపటి రామాంజనేయులు, కుళ్లాయప్ప, అల్లాబకాష్, వెంగమ నాయుడు తనయుడు పెనకలపాటి అజయ్ కుమార్, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలను బలోపేతం చేస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

రాప్తాడురూరల్: స్థానిక సంస్థలను బలోపేతం చేస్తామని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అనంతపురం రూరల్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తుండటంపై అధికారులను ఆరా తీశారు. స్థలాలు చూపిస్తామని పక్కా భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను గౌరవిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను గౌరవించాలని సూచించారు. గ్రామాల్లో వారికి తెలియకుండా ఎలాంటి పనులు చేయొద్దన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలన్నారు. పేదలకు గత ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ పరిధిలో రూపాయి బడ్జెట్ లేదని రోజువారి అవసరాలకు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రాజీవ్‌కాలనీ సర్పంచ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వంతో మాట్లాడి పంచాయతీలకు నిధులు విడుదల చేయిస్తామన్నారు. పన్నుల వసూళ్లు వందశాతం జరగాలన్నారు. పన్నుల వసూలు అయితేనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమావేశానికి అధికారులు కచ్చితంగా రావాల్సిందే అన్నారు. గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ పుల్లయ్య, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైస్ ఎంపీపీలు కృష్ణారెడ్డి, బాలాజీ, మండల అధికారులు శ్రీనివాసరెడ్డి, రామ్మూర్తి, ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తో జిల్లా నాయకుల భేటీ


వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలసిన పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్


వైఎస్ జగన్‌తో పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకుడు గౌస్‌బేగ్


తన కుమార్తె వివాహానికి వైఎస్ జగన్‌ను ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు శుక్రవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకుడు గౌస్‌బేగ్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నగరాధ్యక్షుడు బాబా సలాం తదితరులు కలిశారు. తన కుమార్తె వివాహానికి రావాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ నేత ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి ఆహ్వానించారు.

అన్ని పంటలకు బీమా వర్తింపజేయాలి

రాప్తాడురూరల్: గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా విధానాన్ని రద్దు చేసి, తిరిగి పాత పద్ధతినే తీసుకురావాలనే చంద్రబాబు ప్రభుత్వ ఆలోచన సరికాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పెరిగిన పెట్టుబడి ఖర్చులు, గిట్టుబాటు ధర లేకపోవడం లాంటి సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న నేటి పరిస్థితుల్లో చిన్న భారాన్ని సైతం రైతు భరించే స్థితిలో లేడన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన నిష్పత్తిలో బీమా ప్రీమియం మొత్తం చెల్లించి ఆదుకోవాలన్నారు. ఉచిత బీమా అన్ని పంటలకు వర్తింపజేయాలన్నారు. వేల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాలకు ఖర్చు పెడుతున్న ప్రభుత్వాలు రైతులను ఆదుకోకపోవడం దురదృష్టకరమన్నారు. 2014లో కూడా చంద్రబాబు భేషరతుగా రైతుల రుణాలు రద్దు చేస్తామని చెప్పి మోసం చేశారని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండకపోవడానికి, అబద్ధాలు చెప్పడానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే రైతు భరోసా కింద రూ.20 వేలు ఇస్తానని చెప్పారు. ఖరీఫ్ మొదలై నెల దాటినా అతీగతీలేదన్నారు. పెట్టుబడి ఖర్చుల కోసం రైతులు చంద్రబాబు హామీ వైపు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. గత సీఎం జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా పేరుతో ఐదేళ్లు క్రమం తప్పకుండా పెట్టుబడి ఖర్చులకు కొంత సాయం చేశారన్నారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు రైతు భరోసా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రథయాత్ర చూసిన కనులదే భాగ్యం


మాట్లాడుతున్న రాధామనోహరదాసు

అనంతపురం కల్చరల్: ప్రపంచంలోనే అతి గొప్పదైన పూరీ జగన్నాథ రథయాత్రను చూసిన కనులదే భాగ్యమని ప్రఖ్యాత ప్రవచన కర్త, హైందవ ధర్మప్రచారకుడు రాధామనోహర దాసు అన్నారు. శనివారం నగరంలో భారీ ఎత్తున జరుగనున్న పూరీ జగన్నాథ రథయాత్ర కోసం పలు రాష్ట్రాల నుంచి ఇస్కాన్ ప్రతినిధులు, ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు, హిందూ ధర్మప్రచారకులతో పాటూ వివిధ కళారూపాలను ప్రదర్శించే కళాకారులు అనంతకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నగరానికి విచ్చేసిన రాధామనోహర దాసు స్థానిక ఇస్కాన్ గోశాలలో గోవిందుడికి స్వయంగా అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. మూలవిరాట్టునే భక్తుల ముంగిటకు తెచ్చే నవ్య సంప్రదాయం ఒక్క జగన్నాథ రథయాత్రలోనే సాగుతుందన్నారు. శ్రీకృష్ణ, బలదేవ, సుభద్రదేవి ప్రతిమల దర్శనంతో జీవితం పునీతం అవుతుందన్నారు. శనివారం సాయంత్రం నుంచి నగర వీధుల్లో సాగే రథయాత్రలో అందరూ పాల్గొనాలని సూచించారు. హైందవ సంప్రదాయాలు, సంస్కృతికి అద్దం పట్టే అతి పెద్ద వేడుకలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు, గోశాల నిర్వాహకులు సుదర్శన ప్రభు తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం సందడి షురూ

- గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు


తలుపూరులో కొలువుదీరిన పీర్లు


పి.యాలేరులో అలంకరణలో పీర్లు

ఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం సందడి నెలకొంది. ఆత్మకూరు, పి.యాలేరు, తలుపూరు గ్రామాల్లో పీర్లస్వాములను పీర్ల చావిడిలో కొలువుదీర్చారు. భక్తులు పీర్లకు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈనెల 14వ తేదీన ఆత్మకూరులో చిన్న సరిగెత్తు, 15న విడిదినం, 16న పెద్ద సరిగెత్తు, 17న జలధి తదితర కార్యక్రమాలు జరగనున్నాయి.

శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి


కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సభ్యత్వం అందజేస్తున్న జేవీవీ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: వైజ్ఞానిక సమాజం నిర్మాణం కోసం విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్ అన్నారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సాకే భాస్కర్ మాట్లాడుతూ.. దేశంలో జరుగుతున్న కొన్ని అశాస్త్రీయ సంఘటనలకు కారణం ప్రజల్లో శాస్త్రీయ చైతన్యం లేకపోవడమే అన్నారు. వాటిని ఎదుర్కోవాలంటే విద్యార్థి దశ నుంచే తప్పనిసరిగా శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని కోరారు. ప్రస్తుత కాలంలో కొంతమంది బాబాల అవతారం ఎత్తి అమాయక ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని వారి మానప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారని జేవీవీ నగర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి.ప్రసూన తెలిపారు. ప్రజల్లో చైతన్యం కలిగించడమే లక్ష్యంగా జేవీవీ పని చేస్తుందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పి.శంకరయ్యకు జేవీవీ సభ్యత్వం ఇచ్చారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు గాంగే నాయక్, విజయలక్ష్మి, లలిత, నగర అధ్యక్ష కార్యదర్శులు వీరరాజు, రామిరెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, ప్రసాద్ రెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై గ్రామాల్లో సర్వే


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ రవి నాయక్

చెన్నేకొత్తపల్లి: ఈనెల 17 నుంచి మండలంలోని గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ సిబ్బందికి సూచించారు. ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు ఆశావర్కర్లు ఇతర సిబ్బందితో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. లెప్రసీ (కుష్టు) లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు సిబ్బంది ఇంటింటి సర్వే చేయాలన్నారు. లెప్రసీ నిర్మూలనకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వెల్లడించారు. లెప్రసీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. ఆశావర్కర్లు రోజూ 30 ఇళ్ల సర్వే చేసి వివరాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఆగస్టు రెండులోపు సర్వే పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలన్నారు.

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించొద్దు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా న్యాయ సహకార సంస్థ, కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో ట్రాఫిక్ నియమాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శంకరయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్ యాదవ్ మాట్లాడారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వల్ల కలిగే నష్టాలు, జరిమానాలపై వివరించారు. న్యాయవాది ఎన్.హరికృష్ణ ట్రాఫిక్ విధివిధానాలు, లైసెన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు బి.రామకృష్ణ, ఎస్.పాతి మున్నాట్ బేగం, బీవీ రమణ నాయుడు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి ఆంజనేయులు

అనంతపురం అగ్రికల్చర్: నాటిన మొక్కలను సంరక్షించి పర్యావరణ పరిరక్షణ, సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పట్టుపరిశ్రమ అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. శుక్రవారం స్థానిక పట్టుశాఖ కార్యాలయ ఆవరణలో ఆ శాఖ జిల్లా అధికారి డి.ఆంజనేయులుతో పాటు అక్కడ పని చేస్తున్న ప్రతి ఒక్కరూ తమ పేర్లతో తలా ఒక మొక్క నాటారు. అలాగే సంరక్షణ బాధ్యతలు చూస్తామంటూ అందరూ ప్రతిజ్ఞ చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు హరిత అనంతకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. మొక్కలు నాటిన ఉద్యోగులు బదిలీపై వెళ్లినా, ఉద్యోగ విరమణ చేసినా ఆ స్థానంలో వచ్చే ఉద్యోగులు చెట్టు పెంచే బాధ్యత తీసుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సెరికల్చర్ అధికారి ఓబులేసు, క్లరికల్ స్టాఫ్, అటెండర్లు, డ్రైవర్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతా నమోస్తుతే


భక్తిగీతాలు ఆలపిస్తున్న మహిళలు


శాకంబరి అలంకరణలో వాసవీ మాత

అనంతపురం కల్చరల్: ఆషాఢ మాసంలో వచ్చిన శుక్రవారం నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాలలో దర్శనమిచ్చింది. ముఖ్యంగా కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో జరుగుతున్న వారాహి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పలు రకాల పచ్చని ఆకులతో శాకంబరిగా అలంకరించి ఆరాధించారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు బారులు తీరి అమ్మవారిని భజన, గీతాలతో పూజించారు. అలాగే సిండికేట్ నగర్‌లోని దత్తాత్రేయ విరూపాక్ష దేవాలయంలో స్వామీజీ నేతృత్వంలో వారాహి మాతకు విశేష పూజలు జరిగాయి. పాతూరు చెరువు కట్టపై వెలసిన నిముషాంబాదేవి ఆలయంలో ఐదవ రోడ్డు పెద్దమ్మ తల్లి, హెచ్చెల్సీ కాలనీ చాముండేశ్వరి, గుత్తి రోడ్డు చౌడేశ్వరి మాత, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవార్లు విశేష పూజలందుకున్నారు.

గూగూడులో ఘర్షణ

నార్పల: మద్యం మత్తులో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్న ఘటన మండలంలోని గూగూడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. గూగూడు బ్రహ్మోత్సవాలకు శుక్రవారం వేర్వేరు ప్రాంతాలకు చెందిన నాగరాజు, శ్రీకాంత్ వచ్చారు. కుళ్లాయిస్వామి దర్శనం అనంతరం వారు మద్యం సేవించారు. మద్యం మత్తులో శ్రీకాంత్ బీర్ బాటిల్‌తో దాడి చేయగా నాగరాజు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు నాగరాజును 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగరాజు స్వగ్రామం బెంగళూరు కాగా శ్రీకాంత్ ధర్మవరానికి చెందిన వ్యక్తి. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.